ప్రజాశక్తి
శనివారం 25 జనవరి 2025 5 కర్నూలు

మాట్లాడుతున్న విద్యాశాఖ కమిషనర్ విజయ రామరాజు

టెస్టు పాస్ కావాల్సిందే..!

- అందుబాటులోకి ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్టింగ్ ట్రాక్
- పాస్ అయితేనే డ్రైవింగ్ లైసెన్స్

డ్రైవింగ్ టెస్ట్ పాస్ అయ్యేందుకు గతంలో చాలా మంది అడ్డదారులు తొక్కేవారు. కాస్తో కూస్తో డ్రైవింగ్ వచ్చినా డ్రైవింగ్ లైసెన్స్ పొందేవారు. రాష్ట్ర ప్రభుత్వం ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్టింగ్ ట్రాక్ అందుబాటులోకి తెచ్చింది. దాంతో సాంకేతిక ఆధారంగా డ్రైవింగ్ పరీక్ష నిర్వహిస్తారు. టెస్ట్ పాస్ అయితేనే లైసెన్సును మంజూరు చేస్తారు. ప్రస్తుతం కర్నూలులో ఈ ట్రాక్ అందుబాటులోకి రాగా నంద్యాలలో ట్రాక్ నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపారు. డోన్‌లో ట్రాక్ నిర్మాణ పనులు సాగుతున్నాయి...

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

ఆర్‌టిఓ ఆఫీసులో ఏమాత్రం పలుకుబడి ఉన్నా గతంలో డ్రైవింగ్ లైసెన్స్ వచ్చేది. టెస్ట్‌లో పాల్గొనకపోయినా ఫర్వాలేదు. వచ్చీరాని డ్రైవింగ్ ద్వారా రోడ్డు ప్రమాదాలూ తరచుగా జరుగుతూనే ఉన్నాయి. రోడ్డు ప్రమాదాల నివారణకు డ్రైవింగ్ నాపుణ్యాలు తప్పనిసరిగా ఉండాల్సిందేనన్న ఆలోచనతో రవాణాశాఖ సరికొత్త ఆలోచనకు శ్రీకారం చుట్టింది. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి కొత్త విధానాన్ని అందుబాటులోకి తెచ్చింది. దీని ద్వారా సిఫార్సులకు, మధ్యవర్తులకు చెక్ పెట్టినట్లైంది. తప్పనిసరిగా డ్రైవింగ్ టెస్టులో పాల్గొని అందులో పాస్ కావాల్సిందే. లేదంటే మళ్లీ దరఖాస్తు చేసుకుని టెస్టులో పాస్ అవ్వాల్సిందే. కర్నూలు శివారు బి.తాండ్రపాడులోని ప్రాంతీయ రవాణాధికారి ప్రాంగణంలో ఇటీవల ఆటోమేటిక్ డ్రైవింగ్ టెస్టింగ్ ట్రాక్- ఏడీటీటీ విధానాన్ని అమల్లోకి తెచ్చారు. దీని కోసం 200 మీటర్ల డ్రైవింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేశారు. నిత్యం 30 మంది వరకు డ్రైవింగ్ లైసెన్సు పరీక్షల కోసం వస్తున్నారు. డ్రైవింగ్‌లో పూర్తిస్థాయిలో ప్రావీణ్యం ఉన్నవారే ఉత్తీర్ణులవుతున్నారు. ట్రాక్‌పై అవగాహన లేకపోవడం వల్ల పరీక్షలో ఎక్కువమంది తప్పుతున్నారు. డ్రైవింగ్‌లో శిక్షణనిచ్చే పాఠశాలలు సైతం ట్రాక్ ను పరిశీలించి ఇదే విధంగా తర్ఫీదు ఇవ్వాల్సి ఉంటుందని అధికారులు చెబుతున్నారు. డ్రైవింగ్ ట్రాక్ చుట్టూ 20 స్తంభాలు ఏర్పాటు చేశారు. ప్రతి స్తంభానికి నాలుగు కెమెరాలు, సెన్సార్‌లు, సిగ్నల్ లైట్లు పెట్టారు. ట్రాక్ చుట్టూ ట్రాఫిక్ డివైడర్లు ఉంచారు. డ్రైవింగ్ చేసే వాహనదారుడి వాహనానికి కెమెరాతో కూడిన చరవాణిని ముందు పెడతారు. వాహనదారుడు ట్రాక్ డ్రైవింగ్ మొదలుపెట్టినప్పటి నుంచి పూర్తయ్యేదాకా కంప్యూటర్‌లో వివరాలు నమోదవుతాయి. వాహనదారుడు ఏమాత్రం సిగ్నల్ జంప్ చేసినా, ట్రాఫిక్ డివైడర్ తాకినా అపసవ్య మార్గంలో వెళ్లినా, ఇండికేటర్లు వేయకపోయినా, కుడి, ఎడమ వైపు మలుపు తిరిగేముందు సిగ్నళ్లు వేయకపోయినా, నాలుగు చక్రాల వాహనదారులు రివర్స్ చేయకపోయినా డ్రైవింగ్ పరీక్షలో అర్హత సాధించడం కష్టమే. వాహనం నడిపే వివరాలన్నీ సెన్సార్ ద్వారా కంప్యూటర్‌లో నమోదవుతాయి. డ్రైవింగ్ లైసెన్స్ కోసం వచ్చేవారు అధికశాతం ఫెయిల్ అవుతుండటంతో మొదట వారికి కొత్త ట్రాక్‌ను పరిశీలించమని చెబుతారు. ఆ తర్వాత పరీక్ష నిర్వహిస్తారు. ఈ పరీక్ష వల్ల తమకే మేలని అభ్యర్థులు చెబుతుండగా ఇలాంటి విధానం ద్వారా ప్రమాదాల సంఖ్యను తగ్గించటానికి అవకాశం ఉంటుందన్నదని అధికారులు చెబుతున్నారు. ఇలాంటి ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్టింగ్ ట్రాక్ నిర్మాణ పనులు డోన్‌లో సాగుతున్నాయి. నంద్యాలలో ట్రాక్ ఏర్పాటు చేసేందుకు స్థలం కోసం అధికారులు ప్రతిపాదనలు పంపారు.

పాఠశాలల బలోపేతానికి కృషి

- పాఠశాల విద్యా కమిషనర్ విజయ రామరాజు
- కర్నూలులో ప్రాంతీయ విద్యా సదస్సు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

పాఠశాల కేంద్రంగా అమలవుతున్న విద్యావిధానాలు క్షేత్రస్థాయిలో ఆచరణాత్మకంగా సత్ఫలితాలు సాధించాలని, పాఠశాలల బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని పాఠశాల విద్య కమిషనర్ వి.విజయరామరాజు అన్నారు. శుక్రవారం కర్నూలు జి.పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల ఆడిటోరియంలో ఉమ్మడి కర్నూలు జిల్లా ప్రాంతీయ విద్యాసదస్సు నిర్వహించారు. జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాష అధ్యక్షతన జరిగిన ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా పాఠశాల విద్యాశాఖ కమిషనర్ , డైరెక్టర్ విజయరామరాజు హాజరయ్యారు. ఉమ్మడి కర్నూలుజిల్లాల్లోని పాఠశాలలను బలోపేతం చేయడం, జిఒ నెంబర్ 117 ఉపసంహరణ అనంతపరిణామాలు, ప్రత్యామ్నాయ పరిస్థితులపై ప్రభుత్వం దృష్టి సారించినందున పలు కీలక అంశాలపై సదస్సులో చర్చించారు. పాఠశాలలు బలోపేతం చేయడానికి సూచనలు ఇచ్చారు. జిల్లాల పరిణామాలు తద్వారా ప్రాథమిక, సెకండరీ విద్యలో చేపట్టాల్సిన ప్రత్యామ్నాయ విధానాలపై చర్చించారు. వారి నుండి పలు సూచనలు తీసుకున్నారు. అసలు విద్య వ్యవస్థ ఎక్కడ కుంటు పడిందనే దగ్గర నుండి ఎలా బాగు పరచాలనే వరకు చర్చించారు. కమిషనర్ విజయరామరాజు మాట్లాడుతూ అసలు ఆన్‌లైన్‌లో ఉన్న డేటా , ఫిసికల్‌గా ఉన్న డేటాను నియోజవర్గ స్థాయి అధికారులు ఎంఇఒలు పరిశీలించాక జిల్లా కలెక్టర్‌కు పంపించాలన్నారు. జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలో మరింత నాణ్యమైన విద్యాబోధన అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అందులో భాగంగా ప్రాంతీయ సదస్సులను నిర్వహిస్తామన్నారు. నంద్యాల జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి ఆర్‌జెడి సామ్యూల్, డిఇఒ శామ్యూల్ పాల్ , జడ్‌పి సిఇఒ నాసర్ రెడ్డి ,ఉమ్మడి జిల్లా, ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్లు అధికారులు, డివిజనల్ ఉపవిద్యాధికారులు, నియోజకవర్గ అధికారులు, మండల విద్యాధికారులు 1అండ్ 2, క్లస్టర్ ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇరిగేషన్ ఎస్ఇగా ద్వారకనాథ్ రెడ్డి

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్

నీటిపారుదలశాఖ కర్నూలు ఎస్ఇగా కడప జిల్లాలో విధులు నిర్వహిస్తున్న ఎస్.ద్వారాకనాథ్ రెడ్డి కర్నూలు ఎస్ఇగా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇఇనుండి ఎస్ఇగా రాష్టంలో పలువురు పొదన్నతి పొందారు. అందులో భాగంగా ద్వారాకనాథ్‌రెడ్డి ఇఇ నుండి ఎస్ఇగా పొదోన్నతి పొంది కర్నూలు ఎస్ఇగా బదిలీ అయ్యారు. ప్రస్తుతం ఎస్ఇగా ఉన్న బాలచంద్రరెడ్డి డిప్యూటీ ఎస్ఇగా కొనసాగనున్నారు. నూతన ఎస్ఇగా బాధ్యతలు తీసుకున్న ద్వారాకనాథ్ రెడ్డికి పలువురు ఇంజినీర్లు, అధికారులు సిబ్బంది పుష్పగుచ్చాలతో అభినందించారు. ఆయన పదవీకాలం మూడు నెలలు మాత్రమే ఉండటం గమనార్హం.

కబ్జాకోరులపై చర్యలు తీసుకోవాలి

- పిపిఎస్ఎస్ ఆధ్వర్యంలో జలమండలి ఆఫీసు ఎదుట ధర్నా
- కబ్జాకు గురైన భూములను స్వాధీనం చేసుకుంటాం: ఎస్ఇ

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్

జిల్లాలో చెరువులు, వాగులు, అలుగులను కబ్జా చేసిన బిల్డర్లను, రియల్ ఎస్టేట్ వ్యాపారుల నుండి స్వాధీనం చేసుకోవాలని పట్టణ పౌరసంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు ఇరిగినేని పుల్లారెడ్డి, ఎ.వెంకటేశ్వర్లు, న్యాయవాది ఆర్.చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. శుక్రవారం జలమండలి కార్యాలయం ఎదుట పట్టణ పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పలు కాలనీల ప్రతినిధులు ఆందోళన చేశారు. ఈ ఆందోళనకు ఎం.నాగరాజు అధ్యక్షత వహించారు. నాయకులు మాట్లాడుతూ బ్రిటిష్ కాలం నాటి చెరువులు, వాగులు, అలుగులను కబ్జాల నుండి కాపాడాలని ఆందోళన చేసి అర్జీలు ఇచ్చి చెప్పులు అరిగేలా ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నా అధికారులలో స్పందన రావడం లేదని విమర్శించారు. బి- తాండ్రపాడు, గార్గేయపురం చెరువు, వాగుల కబ్జాల ఫోటోలను ఫ్లెక్సీల పై ముద్రించి నీటిపారుదల శాఖ సూపరిండెంట్ ఇంజనీర్ ద్వారక నాథ్ రెడ్డికి చూపెట్టారు. చెరువులు, వాగులు,అలుగు కబ్జా చేసిన వారిని, కబ్జాలకు సహకరించిన అధికారులపై కూడా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కబ్జాలపై చర్యలతోపాటు సదరు భూములను ఎప్పుడూ స్వాధీనం చేసుకుంటారని ఆందోళనకారులు పట్టుబట్టారు. రెవిన్యూ, నగరపాలక సంస్థ, భూముల రికార్డులు , సర్వే శాఖలతో చర్చించి ఆక్రమణకు గురైన నీటిపారుదల శాఖకు సంబంధించిన భూములు అన్ని స్వాధీనం చేసుకుంటామని హామీ ఇచ్చారు. వివిధ కాలనీల ప్రతినిధులు మహమ్మద్ యునూస్, ప్రభాకర్ రెడ్డి, సివి.వర్మ, ఎస్ఆర్ గౌడు, అన్వర్‌బాషా, శ్రీనివాసులు, పురుషోత్తం రెడ్డి, శశి కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

ధర్నా నిర్వహిస్తున్న పిపిఎస్ఎస్ నాయకులు

14వ రోజు 310 మంది అభ్యర్థులు ఎంపిక

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

14వ రోజు నిర్వహించిన పోలీస్ కానిస్టేబుల్ దేహదారుఢ్య పరీక్షల్లో 310 మంది ఫైనల్ పరీక్షలకు ఎంపికయ్యారని కర్నూలు జిల్లా ఇన్‌ఛార్జి ఎస్‌పి అధిరాజ్ సింగ్ రాణా తెలిపారు. శుక్రవారం ఆయన కర్నూలు రెండవ బెటాలియన్ మైదానంలో నిర్వహిస్తున్న పోలీసు దేహదారుఢి పరీక్షలను దగ్గరుండి పర్యవేక్షించారు. పోలీసు నియామక ప్రక్రియలో భాగంగా ఉమ్మడి కర్నూలు జిల్లాకు సంబంధించి కానిస్టేబుల్ ఉద్యోగాల ప్రాథమిక రాత పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు కర్నూలు ఎపిఎస్‌పి రెండవ బెటాలియన్ లో శుక్రవారం 600 మంది అభ్యర్థులను పిలిచారు. 484 మంది అభ్యర్థులు బయోమెట్రిక్ కు హాజరయ్యారు. వారికి సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ తర్వాత ఎత్తు, ఛాతీ వంటి ఫిజికల్ మెజర్మెంట్ టెస్టులు నిర్వహించారు. అనంతరం వారందరికీ ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్టులు 1600 మీటర్ల పరుగు, 100 మీటర్ల పరుగు, లాంగ్ జంప్ పరీక్షలు నిర్వహించారు. 1600 మీటర్ల పరుగు పరీక్షలో 345 మంది అభ్యర్థులు అర్హత సాధించారు. 100 మీటర్ల పరుగు పరీక్షలో 215 మంది అభ్యర్థులు అర్హత సాధించారు. లాంగ్ జంప్ లో 304 మంది అభ్యర్థులు అర్హత సాధించారు. కానిస్టేబుల్ మెయిన్స్(ఫైనల్) పరీక్షకు 14వ రోజు 310 మంది అభ్యర్థులు అర్హత సాధించారు. ఈ కార్యక్రమంలో కర్నూలు జిల్లా ఇన్‌ఛార్జి ఎస్‌పితోపాటు హోంగార్డు కమాండెంట్ సదరన్ రీజియన్ మహేష్ కుమార్, అడిషనల్ ఎస్‌పి అడ్మిన్ జి.హుస్సేన్ పీరా, ఎఆర్ అడిషనల్ ఎస్‌పి కృష్ణమోహన్ ఉన్నారు.

అభ్యర్థులతో మాట్లాడుతున్న ఇన్‌ఛార్జీ ఎస్పీ

'ఉపాధి 'లో రాజకీయ జోక్యం తగ్గించాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్

ప్రజాశక్తి -కర్నూలు కలెక్టరేట్

జిల్లాలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో రాజకీయ జోక్యం తగ్గించాలని, వలసలు నివారణకు కృషి చేయాలని, క్షేత్రస్థాయి సిబ్బందిపై వేధింపులు ఆపాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్, కార్యదర్శి వర్గ సభ్యులు కెవి.నారాయణ, ఎండి అంజిబాబులు డిమాండ్ చేశారు. శుక్రవారం డ్వామా పిడి వెంకటరమణయ్యకు వినతిపత్రం ఇచ్చారు. ఆలూరు మండలంఅరికెర గ్రామంలో హత్య జరిగినట్లు వచ్చిందని, నిన్న ఆస్పరి మండలం కైరుప్పల గ్రామంలో ఇద్దరు క్షేత్ర సాయి సిబ్బంది దారులు దాడులు చేశారని, పోలీస్ స్టేషన్‌లో పంచాయతీ చేసుకున్నారని, వీటన్నిటికీ కారణం నూతనంగా వచ్చిన ప్రభుత్వ విధానాలు అని చెప్పి వాళ్ళు విమర్శించారు. ఉపాధి హామీలో పని చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు తప్పుచేసి ఉంటే సస్పెండ్ చేసి ఉద్యోగం నుంచి తొలగించవచ్చని, ఏ తప్పు లేనటువంటి వారిపైన కక్ష సాధింపు జరుగుతుందన్నారు. ఒకే గ్రామంలో కూటమి సిఫారసు చేసిన సీనియర్ మేటికి మస్టర్ ఇవ్వడం, రెగ్యులర్ సీనియర్ మేటి, ఫీల్డ్ అసిస్టెంట్‌గా ఉన్నవారికి మస్టర్ ఇస్తున్నారనన్నారు. ఈ కారణంగా వ్యవసాయ కూలీలు కూడా గ్రామాల్లో ఉండే రాజకీయాల వల్ల ఎవరి వద్ద మస్టర్ తీసుకొని పనికి వెళ్లాలో అర్థం కాక, సుదూర ప్రాంతాలకు వలసలు పోతున్నారన్నారు. జిల్లాలో ఇప్పటికే దాదాపుగా 3 లక్షలకు పైగా కుటుంబాలు వలసలు వెళ్లాయని, దీనికంతటికి కారణం ప్రభుత్వ విధానాలే అన్నారు. ఇప్పటికైనా క్షేత్రస్థాయి సిబ్బంది పైన వేధింపులు ఆపి వలసులు అరికట్టేందుకు కృషి చేయాలని అన్నారు. వలసలలు పోయిన కుటుంబాల పిల్లలు చదువులు అర్ధాంతరంగా ఆగిపోతున్నాయన్నారు. వారికి ప్రత్యేకంగా సీజనల్ హాస్టల్స్ ఏర్పాటు చేసి వారి విద్యాభ్యాసం నష్టపోకుండా చూడాలని కోరారు. డ్వామా పిడి స్పందిస్తూ ఈ విషయాలను పై అధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు చేపడతామని హెచ్చరించారు.

వినతిపత్రం అందజేస్తున్న గౌస్‌దేశాయ్, నారాయణ, అంజిబాబు

కేర్ పాలి క్లినిక్‌లో రిపబ్లిక్ డే ఆఫర్

రూ.500కు ల్యాబ్ టెస్టులు, ఉచిత ఒపి

మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బిజ్జం రాజశేఖర్ రెడ్డి వెల్లడి

కర్నూలు- ప్రజాశక్తి హాస్పిటల్

ఈనెల 26 రిపబ్లిక్ డే సందర్భంగా కేర్ పాలిక్లినిక్ లో రూ.1100 విలువ కలిగిన ల్యాబ్ టెస్టులను రూ.500 చేస్తున్నామని, ఉచిత ఒపి సౌకర్యం కల్పిస్తున్నామని కేర్ పాలి క్లినిక్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బిజ్జంరాజశేఖర్‌రెడ్డి ప్రజాశక్తితో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మా క్లినిక్‌లో ఈనె 26న రూ.1100 విలువ కలిగిన ల్యాబ్ టెస్టులు, ఎఫ్‌బిఎస్, పిపిబిఎస్, సిబిపి, సీరం క్రియేటినిన్, థైరాయిడ్ ప్రొఫైల్, యూరిన్ రొటీన్ కేవలం రూ.500 చేస్తున్నామని, 26న ఉచిత ఓపి ఉంటుందని తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఉంటుందని ముందుగానే మీ పేరును 9059109108 నెంబర్‌కు ఫోన్‌చేసి పేరు నమోదు చేసుకోవాలని కోరారు. ఈ అవకాశాన్ని ప్రజలు ఉపయోగించుకోవాలన్నారు.

సిబిఐ స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా మనోహర్

ప్రజాశక్తి-కర్నూలు లీగల్

సిబిఐ స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా శ్రీకొండ మనోహర్ నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం నుంచి శుక్రవారం ఆయనకు ఉత్తర్వులు అందాయి. ఉమ్మడి కర్నూలు, కడప, అనంతపూర్, చిత్తూరు జిల్లాలకు సంబంధించిన సిబిఐ కోర్టు కర్నూలులో ఉంది. కర్నూలు సిబిఐ కోర్టు లో అయన ప్రభుత్వం తరపున తన వాదనలు వినిపించనున్నారు. ఆయన ఈ పదవిలో మూడు సంవత్సరాలు కొనసాగనున్నారు.

వైసిపి యూత్ వింగ్ అధ్యక్షుడిగా అశోక్ కుమార్ రెడ్డి

ప్రజాశక్తి-వెల్దుర్తి

వైసిపి రాష్ట్ర అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు వెల్దుర్తి మండలానికి చెందిన నలుగురు వైసిపి నాయకులకు పత్తికొండ నియోజకవర్గం వైసిపి అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమించినట్లు నియోజకవర్గం పార్టీ నాయకులు తెలిపారు. పత్తికొండ నియోజకవర్గ యూత్ వింగ్ అధ్యక్షునిగా బోయినపల్లికి చెందిన నర్సింగ్ అశోక్ కుమార్ రెడ్డిని, నియోజకవర్గ సోషల్ మీడియా ప్రతినిధిగా వెల్దుర్తికి చెందిన గట్టు అరీఫ్‌ను, వైసిపిటియు అధ్యక్షునిగా నరసాపురం గ్రామానికి చెందిన వెంకట కృష్ణారెడ్డిని, వైసిపి అనుబంధ విభాగం పంచాయతీరాజ్ అధ్యక్షుడిగా అల్లుగుండు గ్రామానికి చెందిన శివరామిరెడ్డిని నియమించారు. పార్టీ నమ్మకంతో మాకు ఇచ్చిన ఈ బాధ్యతను పార్టీని మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తామన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డికి, జిల్లా అధ్యక్షుడు ఎస్ వి మోహన్ రెడ్డికి, పత్తికొండ నియోజకవర్గ మాజీఎమ్మెల్యే కంగాటి శ్రీదేవికి మండల వైసిపి నాయకులు బొమ్మన రవీంద్రనాథ్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. వైసిపి నాయకులు, కార్యకర్తలు సంతోషం వ్యక్తం చేశారు.

'కంది' పోతున్న రైతు

దిగుబడి పెరిగి- ధర పతనమై
కందుల కొనుగోలు కేంద్రాలు కరువు

ప్రజాశక్తి-పత్తికొండ

ప్రభుత్వాలు మారిన రైతుల బతుకులు మారడం లేదని రైతుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కందుల ధరలు రోజురోజుకు పతనం కావడంతో రైతులు అయోమయంలో పడ్డారు. పంటను సాగు చేసి మార్కెట్‌కి తీసుకుపోదామనే లోపే ధరలు పతనం కావడంతో దిక్కుతోచని స్థితిలో రైతులు ఉన్నారు. పత్తికొండ మండలం పరిధిలోని గ్రామీణ ప్రాంతాలలో ఉన్న రైతులు 4,032 ఎకరాలలోని కంది పంటను సాగు చేశారు. గత ఏడాది 3200 ఎకరాలలో కంది సాగయింది. వ్యవసాయ పనులు చేసుకుంటూ రైతులు జీవనం సాగిస్తారు. ఒక ఎకరా కంది పంటను సాగు చేయడానికి రూ.20వేల పెట్టుబడి ఇతర ఖర్చులు అవుతుందని రైతులు చెబుతున్నారు. జూన్, జూలై, ఆగస్టు మాసాలలో వర్షాలు ఆశాజనకంగా పడడంతో కంది దిగుబడి కూడా పెరిగింది. ఎకరాకు 4 నుంచి 6 క్వింటాళ్ల మేరకు దిగుబడి వస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. బహిరంగ మార్కెట్‌లో నవంబర్ డిసెంబర్ మాసాలలో కందులు క్వింటాళుకు రూ. పదివేల ధర పలికింది. ప్రస్తుతం మార్కెట్లోని కందుల ధర రూ.6000 ధర పలకడంతో రైతులు నిరాశ చెందుతున్నారు. కంది పంట సాగు చేయడానికి చేసిన అప్పులు కూడా తీరవని రైతుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కనీస మద్దతు ధర కల్పిస్తామని చెబుతున్న ఆచరణలో మాత్రం అధికారులు పూర్తిగా నిద్రావవస్థలో ఉన్నారని రైతు సంఘం నాయకులు విమర్శిస్తున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా రైతులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు.

గిడ్డంగిలో భద్రపరిచాను
రైతు చిన్న ఓబులేసు, పుచ్చకాయలమాడ ,పత్తికొండ మండలం.

కంది పంట 13 ఎకరాలలో సాగు చేశాను. ఎకరాకు రూ.20వేల చొప్పున రూ.2.60 లక్షలపెట్టుబడి పెట్టాను. 60 క్వింటాలు కంది దిగుబడి వచ్చింది. మార్కెట్‌కు కందులు తీసుకొని వెళ్దామంటే ధర తక్కువగా ఉండడంతో గిడ్డంగిలో భద్రపరిచాను. రాష్ట్ర ప్రభుత్వం కనీస మద్దతు ధరతో కొనుగోలు చేస్తే ఆదాయం వస్తుంది.

కందులను ప్రభుత్వమే కొనుగోలు చేయాలి
ఎపి రైతు సంఘం మండల కార్యదర్శి సిద్దయ్య గౌడ్

రాష్ట్ర ప్రభుత్వం కనీస మద్దతు ధరతో క్వింటా రూ.7,550 ఇచ్చి కొనుగోలు చేయాలి. కొనుగోలు కేంద్రాలను తక్షణమే ఏర్పాటు చేయాలి. కొన్న వెంటనే రైతుల ఖాతాలోకి 24 గంటలలోపు నగదుజమ చేయాలి. అధికారులు నిర్లక్ష్యం చేస్తే ఆందోళన చేస్తాం.

రైతు సేవా కేంద్రంలో పేరును నమోదు చేసుకోవాలి
పత్తికొండ మండల ఎఒ వెంకట రాముడు

పత్తికొండ మండలం గ్రామీణ ప్రాం తాలలో ఉన్న కంది రైతులు తమ పేర్లను రైతు సేవ కేంద్రాలలో నమోదు చేసుకోవాలి. రాష్ట్ర ప్రభుత్వం కనీస మద్దతు ధర రూ.7,550 ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

ఓటు విలువ తెలుసుకో..భవితను మలుచుకో...

నగరపాలక కార్యాలయంలో సిబ్బందితో ఓటర్ల ప్రతిజ్ఞ

ప్రజాశక్తి -కర్నూలు కార్పొరేషన్

యువత ఓటు విలువను తెలుసుకుని తన భవితను మలుచుకోవాలని కర్నూలు నియోజక వర్గం రిటర్నింగ్ అధికారి, కమిషనర్ ఎస్ రవీంద్రబాబు పిలుపునిచ్చారు. శుక్రవారం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని, నగరపాలక కార్యాలయంలో సిబ్బందితోఓటర్ల ప్రతిజ్ఞ చేయించారు. కమిషనర్ మాట్లాడుతూ ఓటరే ప్రజాస్వామ్య శక్తిఅని, దేశ భవిష్యత్తును నిర్ణయించేది ఓటు మాత్రమేనన్నారు. 18 ఏళ్ళు నిండిన ప్రతి ఒక్కరూ ఖచ్చితంగా ఓటు నమోదు చేసుకోవాలన్నారు. ఓటు కలిగిన ప్రతి ఒక్కరు ప్రతి ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఓటు వినియోగం ప్రతి ఒక్కరి బాధ్యత అని, మంచి సమాజ స్థాపనకు ఓటే కీలకమన్నారు. ఆలోచించి ఓటు వేయాలని, ఓటింగులో పాల్గొనకపోతే దేశ భవిష్యత్తుకు నష్టం తెచ్చేవారవుతారన్నారు. ఎటువంటి ప్రలోభాలకు పాల్పడకుండా సరైన నాయకుడిని ఎన్నుకోవడంలో యువకులు ముందుండాలని తెలిపారు. ఎఆర్ఒ తహసిల్దార్ ఇ.వెంకటలక్ష్మి, అదనపు కమిషనర్ ఆర్‌జివిక్రిష్ణ, మేనేజర్ ఎన్.చిన్నరాముడు, డిప్యూటీ తహశీల్దార్ డబ్ల్యు.ధనుంజయ్, అకౌంట్స్ ఆఫీసర్ చుండి ప్రసాద్, టిపిఆర్ఒ వెంకటలక్ష్మి, సూపరింటెండెంట్లు ఎఒ రమేష్ బాబు, మంజూర్ బాష, రామకృష్ణ, స్వర్ణలత, టిడ్కో అధికారి పెంచలయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల దినోత్సవం సదర్భంగా ప్రతిజ్ఞ చేయిస్తున్న కమిషనర్ రవీంద్రబాబు

జర్నలిస్టులకు ఈశ్రమ్ కార్డులు పంపిణీ చేస్తున్న డాక్టర్ శంకర్‌శర్మ

జర్నలిస్టులకు ఈ-శ్రమ్ కార్డుతో ఉపయోగం

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

జర్నలిస్టులకు ఈ-శ్రమ్ కార్డు ఎంతగానో ఉపయోగపడుతుందని ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యులు శంకర్ శర్మ తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలోని సమాచార భవనంలో వర్కింగ్ జర్నలిస్టులకు డాక్టర్ శంకర్ శర్మ ఆధ్వర్యంలో ఈ-శ్రమ్ కార్డులు పంపిణీ చేశారు. లేబర్ కార్యాలయ అధికారులు, సిబ్బంది సమాచార భవనం వద్దకు వచ్చి విలేకరులకు ఈ-శ్రమ్ కార్డులను ఆన్ లైన్ లో నమోదు చేసి ముఖ్య అతిథి డాక్టర్ శంకర్ శర్మ చేతుల మీదుగా అందజేశారు. డాక్టర్ శంకర్ శర్మ మాట్లాడుతూ జర్నలిస్టుల విధి నిర్వహనలో ఎలాంటి రక్షణ లేకుండా ఉంటారని, అలాంటి వారికి ఈ-శ్రమ్ కార్డు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. విలేకరులకు వార్తల విషయంలో దౌర్జన్య కారులతో, గుండాలతో ప్రాణాపాయ పరిస్థితులు ఉంటాయన్నారు.ప్రతి ఒక్కరు రాజ్యాంగం కల్పించిన వారి హక్కుల గురించి తెలుసుకోవాలని కోరారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విలేకరులకు ఎలాంటి సదుపాయాలు ఇస్తున్నారో తెలుసుకోవాలని సూచించారు. అందులో భాగంగానే ఈ-శ్రమ కార్డులు పంపిణీ చేశామని, ఈ కార్డు ద్వారా జర్నలిస్టులకు ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు వారి కుటుంబ సభ్యులకు నష్టపరిహారం వస్తుందన్నారు. అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్లు శ్రీలక్ష్మి, కేశన్న, రాంప్రసాద్, విలేకరులు రామస్వామి, చెన్నయ్య, సురేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ బాలిక దినోత్సవం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్ : కర్నూలు ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో జాతీయ బాలికా దినోత్సవాన్ని మహిళా సాధికారిక విభాగం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం. ఇందిరా శాంతి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో బాలికా చైతన్యం పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రిన్సిపల్ డాక్టర్ ఎం. ఇందిరా శాంతి మాట్లాడుతూ సమాజంలో బాలికల పట్ల చూపుతున్న వివక్షను రూపుమాపడానికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలన్నారు. సమాజములో బాలికలు, మహిళల పట్ల జరుగుతున్న శిశు భ్రూణ హత్యలు, బాల్య వివాహాలు, వరకట్న హత్యలు, అత్యాచారాలు, దౌర్జన్యాలు మొదలైన అనాగరిక చర్యలను పౌర సమాజం , ప్రభుత్వాలు కలిసికట్టుగా నియంత్రించాలని పేర్కొన్నారు.బాలికలు విద్యతో పాటు మార్షల్ ఆర్ట్స్ కూడా నేర్చుకో వాలన్నారు.వైస్ ప్రిన్సిపల్ జె.హేమంత్, ఎ.సత్య నారాయణ మహిళా సాధి కారిత వి భాగం సభ్యులైన వి. నాగరత్నమ్మ, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ప్రిన్సిపల్ డాక్టర్ ఇందిరాశాంతి

ప్రజా వినతులను త్వరగా పరిష్కరించాలి

- సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ప్రజాశక్తి - గోనెగండ్ల

రికార్డులను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

ప్రజల నుంచి వచ్చే వివిధ రకాల వినతులను వీలైనంత త్వరగా పరిష్కరించాలని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ తెలిపారు. గోనెగండ్లలో జరుగుతున్న రీ సర్వేను శుక్రవారం ఆయన సందర్శించి, సర్వే నిర్వహిస్తున్న తీరును పరిశీలించారు. అనంతరం స్థానిక తహశీల్దార్ కార్యాలయానికి వెళ్లి గత రీసర్వేకు సంబంధించి గ్రామ సభలు, రెవెన్యూ సదస్సుల్లో ఏ గ్రామాల నుంచి ఎన్ని వినతులు వచ్చాయి.. ఎన్ని సమస్యలను పరిష్కరించారు.. ఏరకంగా పరిష్కరించారు అన్న విషయాన్ని సిబ్బందిని అడిగి తెలుసుకుని రికార్డులను పరిశీలించారు. ప్రజల నుంచి వచ్చే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించడంతో పాటు రీ సర్వేను ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. తహశీల్దార్ కుమారస్వామి పాల్గొన్నారు.

ప్రభుత్వ భవనాలకు జియో ట్యాగింగ్

- డిఎల్‌డిఒ అనురాధ

ప్రతిజ్ఞ చేస్తున్న డిఎల్‌డిఒ అనురాధ, ఎంపిడిఒ అల్లా బకాష్, అధికారులు

ప్రజాశక్తి - చిప్పగిరి

ప్రభుత్వాలకు సంబంధించిన ప్రతి భవనాన్ని తప్పనిసరిగా జియో ట్యాగింగ్ చేయాలని పంచాయతీ కార్యదర్శులకు డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (డిఎల్‌డిఒ) అనురాధ తెలిపారు. శుక్రవారం చిప్పగిరిలోని మండల కార్యాలయంలో ఎంపిడిఒ అల్లా బకాష్ అధ్యక్షతన ఇఒఆర్‌డి బాలన్న ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె అధికారులతో కలిసి ప్రతిజ్ఞ చేయించి, సమావేశం నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శుల పని తీరుపై ఎంపిడిఒ అల్లా బకాష్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడారు. మండలంలోని ప్రతి గ్రామంలోనూ ప్రభుత్వానికి సంబంధించిన సచివాలయ కేంద్రం, అంగన్వాడీ కేంద్రం, పశువైద్యశాల, రైతు సేవా కేంద్రాలు, ఆరోగ్య ఉప కేంద్రాలను జియో ట్యాగింగ్ చేయాలని తెలిపారు. ప్రభుత్వ సర్వేలు సకాలంలో పూర్తి చేయాలన్నారు. పంచాయతీ కార్యదర్శులందరూ సచివాలయ సిబ్బందితో సమన్వయం చేసుకొని గ్రామంలో ఏ సమస్య వచ్చినా పరిష్కరించేలా ఉండాలన్నారు. పరిపాలన అధికారి శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వైసిపి విష సంస్కృతి

- కురువ సాధికారిక కమిటీ సభ్యులు వెంకటేష్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్

ఎమ్మెల్యే వ్యక్తిగత విషయాలపై, మీసం, గడ్డం గురించి మాట్లాడే పని ఎమ్మిగనూరు చరిత్రలో ఎప్పుడూ జరగలేదని, వైసిపి నాయకులు విష సంస్కృతికి తెరతీశారని కురువ సాధికారిక కమిటీ సభ్యులు కెటి.వెంకటేష్ మండిపడ్డారు. శుక్రవారం ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే బీవీ మీసం, గడ్డం చూస్తేనే మీ రాజకీయ జీవితం ముందుకు సాగుతుందా అని మండిపడ్డారు. ఎస్ఐ డాక్టర్ నాయక్‌పై దాడి చేశారని, ఎవరూ పోలీసు అధికారిపై బహిరంగంగా గొడవ చేయలేదని తెలిపారు. ఇది చట్టాన్ని గౌరవించకపోవడమే కాదని, ప్రజాస్వామ్యాన్ని అవమానించడమేనని విమర్శించారు. ఎఫ్ఐఆర్ ఆలస్యంగా నమోదు కావడానికి కారణం చట్టపరమైన విచారణ జరగడమని, వైసిపి నాయకులు తప్పు చేయలేదని నమ్మితే కోర్టులో నిరూపించాలని, చట్టాన్ని అడ్డుకోవడం సిగ్గు చేటని తెలిపారు. వైసిపి నాయకత్వం ఉంటే మాట్లాడాలని, 'ఈరోజు మీది, రేపు మాది' అని బెదిరించడం వల్ల టిడిపికి భయపడడం తెలియదని అన్నారు. ఎస్ఐ డాక్టర్ నాయక్‌ను అవమానించడం వీడియోలో స్పష్టంగా కనిపిస్తోందని, వైసిపి కార్యకర్తలు ఆయనను చుట్టుముట్టి ర్యాగింగ్ చేశారని చెప్పారు. వైసిపి నాయకుల నడవడిక కారణంగానే మీ నేత ఇన్‌ఛార్జీ పదవి పొందలేకపోయారని విమర్శించారు. త్వరలో బుట్టా రేణుక కూడా ఇన్‌ఛార్జీ స్థానం కోల్పోవడం ఖాయమన్నారు. చిల్లర రాజకీయాలు మానుకోవాలని, చట్టాన్ని గౌరవించి నిజాయితీగా నిలబడాలని హితవు పలికారు. బోయ కొటేకల్ జగదీష్, పెద్దమర్రివీడు మల్లయ్య, తిమ్మాపురం హంపయ్య పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వెంకటేష్

మిరప రైతు కంట కన్నీరు...

- ధర పతనం.. ఆందోళనలో అన్నదాతలు
- పెట్టుబడి కూడా రావడం లేదు
- వాతావరణ మార్పులతో పంట దిగుబడులు లేవు

ప్రజాశక్తి - దేవనకొండ

మిరప ధర పతనమైంది. క్వింటా మిరప రూ.10 వేల నుంచి రూ.13 వేల వరకు ధర పలుకుతోంది. గిట్టుబాటు ధర కల్పించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ప్రకృతి వైపరీత్యాలతో దిగుబడులు దెబ్బతిన్నాయి. ఎకరాకు 40 క్వింటాళ్ల రావాల్సి ఉండగా 25 క్వింటాళ్లు రావడం లేదని రైతులు వాపోతున్నారు.

ప్రకృతి వైపరీత్యాలు, అకాల వర్షాలు, వాతావరణం మార్పుల వల్ల ఈఏడాది రైతులు పండించిన పంటలు దిగుబడులు లేక, పంటలకు గిట్టుబాటు ధరలు లేక అన్నదాతలు దిక్కు తోచని స్థితిలో ఉన్నారు. ఈ ఏడాది వ్యవసాయ బావులు, బోర్లు, హంద్రీనీవా కాలువల కింద రైతులు 2 వేల ఎకరాల్లో మిరప పంటను సాగు చేశారు. గత రెండేళ్ల క్రితం ఆశాజనకంగా ఉన్న మిరప ధరలు గతేడాది నుంచి పూర్తిగా పతనం కావడంతో పంట దిగుబడుల కోసం పెట్టిన పెట్టుబడులు కూడా రాకపోవడంతో పూర్తిగా నష్టపోయామని రైతులు వాపోతున్నారు. ఎకరా మిరప పంట సాగు చేసేందుకు పొలం దుక్కులు, మిరప నాటు, ఎరువులు, క్రిమిసంహారక మందులు, మిరప పంట తీత కూలీలకు రూ.లక్ష దాకా ఖర్చు అవుతుందని రైతులు పేర్కొంటున్నారు. ఈఏడాది మిరప పంట క్వింటా రూ.10 వేల నుంచి రూ.13 వేల దాకా మాత్రమే ధర పలుకుతోంది.

మిరప పంటను ఆరబెట్టిన రైతు

పంట దిగుబడి 40 క్వింటాళ్లు రావాల్సి ఉండగా వాతావరణ మార్పులతో 25 క్వింటాళ్లకు పడిపోయింది. పెట్టిన పెట్టుబడులు కూడా రాక అప్పుల్లో కూరుకు పోయామని రైతులు వాపోతున్నారు. పెరిగిన ఎరువుల ధరలు, కూలి ధరలతో ఉక్కిరిబిక్కిరి అయ్యామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిట్టుబాటు ధరలు కల్పించడంలో విఫలమయ్యాయని రైతులు విమర్శిస్తున్నారు. మిరప పంటకు గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

గిట్టుబాటు ధరలు లేవు

- ఉప్పర హనుమంతు, దేవనకొండ

గతేడాది నుండి గిట్టుబాటు ధరలు లేకపోవడంతో నష్టాల్లో కూరుకుపోయాం. 3 ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకుని మిరప పంట సాగు చేశాం. ఈఏడాదయినా గిట్టుబాటు ధర వస్తుందన్న ఆశతో మిరప పంట సాగు చేశాం. ఈ ఏడాది కూడా మిరప పంటకు గిట్టుబాటు ధర లేకపోవడంతో అప్పుల్లో కూరుకు పోయాం.

పంట దిగుబడులు తగ్గాయి

- చాకలి లింగన్న, ఐరన్ బండ బి సెంటర్

రెండెకరాల పొలంలో వ్యవసాయ బోరు కింద మిరప పంట సాగు చేశాం. వాతావరణ మార్పుల వల్ల మిరప పంట దిగుబడి పూర్తిగా తగ్గింది. నవంబర్, డిసెంబర్‌లో కురిసిన అకాల వర్షాలతో మిరప పంట దెబ్బతిని తాలుకాయలు ఎక్కువ పడ్డాయి. ఎకరాకు 40 క్వింటాళ్ల దిగు బడి రావాల్సి ఉండగా కేవలం 20 నుంచి 25 క్వింటాళ్లు మాత్రమే వచ్చింది. ప్రభుత్వాలు గిట్టుబాటు ధర కల్పించకపోవడంతో పూర్తిగా నష్టపోయాం. గతేడాది నుంచి గిట్టుబాటు ధర లేక రైతులు తీవ్రంగా దెబ్బతిన్నాం. ప్రభుత్వాలు ఆదుకోవాలి.

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి

బాధితుని ఆదుకోవాలి

- మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి

ప్రజాశక్తి - ఆదోని

విద్యుదాఘాతంతో నష్టపోయిన సంతోష్ కాటన్ జిన్నింగ్ యజమానిని ప్రభుత్వ ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్ రెడ్డి కోరారు. శుక్రవారం వ్యవసాయ మార్కెట్ యార్డు సమీపంలో ఉన్న సంతోష్ జిన్నింగ్ ఫ్యాక్టరీ యజమాని ప్రశాంత్‌ను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పత్తి జిన్నింగ్ ఫ్యాక్టరీలో సంభవించిన ప్రమాదం వల్ల సుమారు రూ.12 కోట్ల నష్టం వాటిల్లిందని తెలిపారు. ఇన్సూరెన్స్ అధికారులు సత్వరమే సహాయమందేలా చూడాలని కోరారు. దీనిలో సుమారు 80 ఫ్యాక్టరీలు ఉన్నాయని, వారందరూ నష్టపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. మార్కెట్ యార్డు ఛైర్మన్ దేవిశెట్టి ప్రకాష్ మాట్లాడుతూ... ప్రమాదం సంభవించినప్పుడు అగ్నిమాపక కార్యాలయం ముందు దారికి అడ్డంగా బైక్‌లు ఉంచడం వల్ల సకాలంలో చేరుకోలేక నష్టం తీవ్రమవుతోందని, అధికారులు స్పందించి వాహనాలు నిలపకుండ చూడాలని తెలిపారు.

'నేడు జాతీయ ఓటర్ల దినోత్సవం జరుపుకోవాలి'

ప్రజాశక్తి - మంత్రాలయం

జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని శనివారం ఘనంగా జరుపుకోవాలని హాలహర్వి తహశీల్దార్ నజ్మ బాను, ఎంపిడిఒ వరలక్ష్మి తెలిపారు. హాలహర్వి తహశీల్దార్ కార్యాలయం, ఎంపిడిఒ కార్యాలయంలో అధికారులు జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. ఓటు హక్కును కచ్చితంగా వినియోగించుకోవాలని ఓటర్లకు తెలిపారు. సర్పంచి మల్లికార్జున పాల్గొన్నారు.

'ఆటో కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి'

ప్రజాశక్తి - ఆదోని

ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఎపి ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ పట్టణ అధ్యక్షులు టి.వీరేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక జెబి గార్డెన్స్‌లో ఈనెల 31న విజయవాడలో జరిగే ఆటో యూనియన్ 4వ రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయాలని పట్టణంలోని అన్ని స్టాండ్ల ఆటో కార్మికులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఈ.గోపాల్ గౌడ్ మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలతో యువత ఉద్యోగాల్లేక జీవనోపాధి కోసం ఆటో రంగాన్ని ఎంచుకుని కుటుంబాలను పోషించుకుంటున్నారని తెలిపారు. గత కొన్నేళ్ల నుంచి రాజకీయ నాయకులు ఆటోనగర్ ఏర్పాటు చేస్తామని వాగ్దానాలు చేసి ఇప్పటికీ నెరవేర్చలేదని విమర్శించారు. ప్రభుత్వం ఆటో కార్మికులకు ఆటోనగర్ ఏర్పాటు చేసి పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. సిపిఐ జిల్లా సమితి సభ్యులు విజయ్, ఎఐవైఎఫ్ పట్టణ అధ్యక్షులు లింగప్ప, ఆటో స్టాండ్ అధ్యక్ష కార్యదర్శులు రామకృష్ణ, రవికుమార్, పీటర్, నరసింహులు, చిట్టిబాబు, నాగరాజు, శ్రీరామ్, ఈరన్న, తిక్కస్వామి, ఈరన్న, మర్రిస్వామి, శరత్ బాబు, పాండు పాల్గొన్నారు.

ఆర్‌కె కంటి వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - నందవరం

నందవరం పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం ఎమ్మిగనూరు ఆర్‌కె కంటి వైద్యశాల ఆధ్వర్యంలో డాక్టర్ కె.హేమంత్ కుమార్ ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజలకు సేవ చేయాలనే దృక్పథంతో ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కంటి ఆపరేషన్ అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ కింద ఉచితంగా ఎమ్మిగనూరు ఆర్‌కె కంటి వైద్యశాలలో ఆపరేషన్ చేస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ శిబిరానికి 185 మంది రోగుల వచ్చారని తెలిపారు. వారికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. అందులో 40 మంది దాకా కంటి ఆపరేషన్లు అవసరమవుతాయని వారికి సూచించినట్లు తెలిపారు. వయస్సుతో సంబంధం లేకుండా చిన్నపిల్లల నుంచి పెద్దల వరకు కంటి సమస్యలు పెరిగిపోయాయని, కంటి భద్రత కోసం కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు ఎక్కువ తీసుకోవాలని సూచించారు. నందవరం ఆర్ఎంపి చంద్రగుప్త, జగదీష్, ఆర్‌కె వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.

పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ హేమంత్ కుమార్

ధర్నాపై కేసు నమోదు అక్రమం

- ప్రజాస్వామ్య బద్ధంగా నిరసన తెలిపితే అక్రమ కేసులా
- వైసిపి పట్టణ అధ్యక్షులు కామ్మర్తి నాగేశప్ప

ప్రజాశక్తి - ఎమ్మిగనూరురూరల్

వైసిపి నాయకులు న్యాయబద్ధంగా ధర్నా చేస్తే అక్రమంగా కేసులు పెట్టడం తగదని వైసిపి నాయకులు మండిపడ్డారు. శుక్రవారం వైసిపి కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైసిపి పట్టణ అధ్యక్షులు కామ్మర్తి నాగేశప్ప, మున్సిపల్ వైస్ ఛైర్మన్ డి.నజీర్ అహ్మద్, ఎంపిపి కేశన్న, నందవరం మండల అధ్యక్షులు శివారెడ్డి గౌడ్, జిల్లా అధికార ప్రతినిధి యుకె.రాజశేఖర్, చేనేత జిల్లా అధ్యక్షులు ఎంకె.శివ ప్రసాద్, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షులు విరుపాక్షి రెడ్డి, కనకవీడు పేట శ్రీనివాస్ రెడ్డి మాట్లాడారు. 2024 అక్టోబర్ 16న ప్రజా సమస్యలపై శాంతియుతంగా ధర్నా నిర్వహించగా ప్రభుత్వం కేసు నమోదు చేయలేదని, ఇప్పుడు కేసులు నమోదు చేశారని తెలిపారు. ఎమ్మిగనూరు డీఎస్పీ కార్యాలయం నుంచి తీసుకున్న నోటీసుల ఆధారంగా రవి కుమార్ రెడ్డి, యుకె.రాజశేఖర్, బిఆర్.బసిరెడ్డి, డి.నజీర్ అహ్మద్, కదిరికోట సునీల్ కుమార్, జె.శివారెడ్డి గౌడ్, భీమిరెడ్డి, కేశన్నపై కేసులు నమోదు చేసినట్లు తెలిసిందని అన్నారు. ప్రజా సమస్యలపై శాంతియుత పోరాటం చేస్తే ప్రభుత్వం ఏ విధమైన చర్యలు తీసుకోలేదని, ఇప్పుడు అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ తప్పుడు కేసులు పెట్టి తమను రాజకీయంగా అడ్డుకోవాలని ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. భయపడే ప్రసక్తే లేదన్నారు. తమ నాయకుడు జగన్మోహన్ రెడ్డి కూడా ఇలాంటి తప్పుడు కేసులను ఎదుర్కొని విజయం సాధించారని, ఆయన మార్గాన్ని అనుసరిస్తూ తాము ముందుకు సాగుతాయని తెలిపారు. ఈ కేసు ఘటనపై వైసిపి ఇన్‌ఛార్జీ బుట్టా రేణుక తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారని చెప్పారు.

సమావేశంలో మాట్లాడుతున్న నాగేశప్ప

డ్రైవింగ్ టెస్ట్, వాహనాల ఫిట్‌నెస్ టెస్టులను ప్రయివేట్ సంస్థలకు అప్పగించొద్దు

- సిఐటియు జిల్లా అధ్యక్షులు రాధాకృష్ణ

ప్రజాశక్తి - ఆలూరు

రాష్ట్ర ప్రభుత్వం డ్రైవింగ్ టెస్ట్, వాహనాల ఫిట్‌నెస్ టెస్టులను ప్రయివేట్ సంస్థలకు అప్పగిస్తున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ, ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ కోరారు. శుక్రవారం సిఐటియు ఆలూరు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఎపి టాటా మ్యాజిక్, అప్పే ఆటో డ్రైవర్స్ యూనియన్ (సిఐటియు) నాయకులు, డ్రైవర్స్ ఆలూరు చెక్‌పోస్ట్ నుంచి ర్యాలీగా అంబేద్కర్ సర్కిల్ చేరుకొని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం సిఐటియు జిల్లా నాయకులు పి.హనుమంతు అధ్యక్షతన బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన సిఐటియు జెండాను సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి కెపి.నారాయణ స్వామి ఆవిష్కరించారు. ముఖ్యఅతిథులుగా రాధాకృష్ణ, ప్రభాకర్ హాజరయి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం జిఒ 21ని తీసుకొచ్చిన భారత న్యాయ సంహిత చట్టం వల్ల అనేకమంది డ్రైవర్లు జైలు పాలయ్యే పరిస్థితి నెలకొందని, జిఒను రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలపై మార్చి 24న జరిగే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. సిఐటియు నాయకులు కృష్ణ, విఠల్, డివైఎఫ్ఐ నాయకులు మైనా, ఆటో యూనియన్ నాయకులు శీను, బాలప్ప, ఈరన్న, నాగరాజు, బాష, గౌడు, సూరి, మున్నా, ఉమేష్, సద్దాం, సుంకన్న, శివ, ఆటో కార్మికులు పాల్గొన్నారు.

జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

సీనియర్ నాయకుని.. నామినేటెడ్ పదవి ఇవ్వండి

- గాజులదిన్నె హనుమంతు

ప్రజాశక్తి - గోనెగండ్ల

పార్టీలో అందరి కన్నా సీనియర్ అయిన తనకు నామినేటెడ్ పదవి ఇచ్చి న్యాయం చేయాలని ఎమ్మిగనూరు ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయ నాగేశ్వర రెడ్డిని టిడిపి మండల సీనియర్ నాయకులు గాజులదిన్నె హనుమంతు కోరారు. శుక్రవారం గోనెగండ్లలోని వ్యవసాయ సహకార సంఘం ఆవరణలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తాను గత 40 ఏళ్లుగా టిడిపిలో కొనసాగుతున్నానని, గతంలో మూడు సార్లు ఎంపిటిసిగా, ఒకసారి తన భార్య ఎంపిపిగా పని చేసిన అనుభవం కూడా ఉందని తెలిపారు. టిడిపి మంత్రాలయం ఇన్‌ఛార్జీగా కూడా పనిచేశానని చెప్పారు. గతంలో ఉన్న ఫ్యాక్షన్ రాజకీయాల్లో బాంబు దాడిని ఎదుర్కొని చేయి పోగొట్టుకున్నానని తెలిపారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన కురువ కులంలో, పార్టీలోనూ సీనియర్‌నైన తనకు ఎమ్మిగనూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్, సింగిల్ విండో ఛైర్మన్ లాంటి ఏదో ఒక నామినేటెడ్ పదవి ఇచ్చి న్యాయం చేయాలని కోరారు. గతంలో కూడా తనకు హామీ ఇచ్చారని, రాజకీయ చివరి దశలో ఉన్న తనకు కచ్చితంగా ఏదో ఒక అవకాశం కల్పిస్తారని భరోసాతో ఉన్నట్లు తెలిపారు.

మృతుల కుటుంబాల వివరాల సేకరణ..?

ప్రజాశక్తి - మంత్రాలయం

కర్ణాటక రాష్ట్రం సింధనూర్ పోతునాళ పట్టణాల మధ్య జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వేద విద్యార్థుల కుటుంబ వివరాలను సేకరించేందుకు శ్రీమఠం పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు చర్యలు చేపట్టారని సమాచారం. స్థానిక శ్రీగురు సార్వభౌమ సంస్కృత విద్యాపీఠం విద్యార్థులు విజయీంద్ర, అభిలాష్, హయవదన గ్రామాలకు వెళ్లి వారి ఆర్థిక పరిస్థితులు, ఇతర వివరాలను తెలుసుకునేందుకు శ్రీమఠం నుంచి అధికారులను నియమించినట్లు సమాచారం. ఒక్కో కుటుంబానికి ఒకరిని పురమాయించి వారి కుటుంబానికి అవసరమైన సహాయం అందించేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి ఒక్కో కుమారుడు ఉండడం, ప్రమాదంలో మృతి చెందడంతో కన్నీటి పర్యంతమయిన పీఠాధిపతులు మానవత్వంతో కుటుంబాలను ఆదుకునేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

క్షేమంగా గమ్యానికి చేర్చే వారే డ్రైవర్లు : సిఐ

ప్రజాశక్తి - గోనెగండ్ల

తాము జాగ్రత్తలు పాటించి వాహనాలు నడుపుతూ తమపై నమ్మకం ఉంచి తమ వాహనాల్లో ప్రయాణించే వారందరినీ సురక్షిత గమ్యానికి చేర్చే వారే డ్రైవర్లు అని ఆదోని ఆర్‌టిఒ మహ్మద్ ఆవిష్, గోనెగండ్ల సిఐ ఎ.గంగాధర్ తెలిపారు. శుక్రవారం సేఫ్టీ డ్రైవర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డ్రైవర్లు పాటించాల్సిన నియమాలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, విధి విధానాలు తదితర అంశాలపై స్థానిక స్టేట్ బ్యాంకు నుంచి వీవర్స్ కాలనీ కమ్యూనిటీ హాలు వరకు ర్యాలీ నిర్వహించి, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఆదోని ఆర్‌టిఒ మహ్మద్ ఆవిష్, సిఐ గంగాధర్, సేఫ్టీ డ్రైవర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు అన్వర్ బాషా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. డ్రైవర్లందరూ తప్పకుండా రోడ్డు భద్రత, నియమాలను పాటించి జాగ్రత్తగా వాహనాలను నడుపుతూ ఇతరులను కూడా సురక్షితంగా గమ్యానికి చేర్చాలని తెలిపారు. డ్రైవర్ల సంక్షేమానికి తమ వంతుగా ఎల్లప్పుడూ సహకరిస్తామని చెప్పారు. అనంతరం డ్రైవర్లకు గుర్తింపు కార్డులను అందజేశారు. డ్రైవర్ల సంఘం నూతన అధ్యక్షులుగా బుట్టా ప్రకాష్, వైస్ ప్రెసిడెంట్‌గా ఖాజా ఖాద్రీ, కార్యదర్శిగా ఎ.మస్తాన్, సహాయ కార్యదర్శిగా దండు వలీ, ట్రెజరర్‌గా మోషిన్, కార్యవర్గ సభ్యులుగా ఉత్తేజ్, గజేంద్ర, సుంకన్న, షేక్షావలీని ఎన్నుకున్నారు. డ్రైవర్ల సంఘం నాయకులు ఇస్సాక్, రాఘవేంద్ర, ఇజాజ్ మహ్మద్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిఐ గంగాధర్

26న నిరసన ర్యాలీని జయప్రదం చేయండి : రైతుసంఘం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్

రైతులు, కార్మికుల చట్టాల సాధనకు ఈనెల 26న చేపట్టే నిరసన ర్యాలీని జయప్రదం చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా నాయకులు లక్ష్మీ నరసయ్య కోరారు. శుక్రవారం రైతు, కార్మిక సంఘాల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో సుందరయ్య భవన్‌లో రైతు సంఘం నాయకులు సురేష్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. లక్ష్మీ నరసయ్య, రైతుసంఘం మండల అధ్యక్షులు అబ్దుల్లా, సిఐటియు పట్టణ కార్యదర్శి రాముడు మాట్లాడారు. సహకార చట్టంలో చేసిన మార్పుల వల్ల సహకార పరపతి సంఘాలు, పాడి సహకార సంఘాలు, మత్స్య సహకార సంఘాలను కార్పొరేట్ కంపెనీల గొడుగు కిందికి చేర్చడమే లక్ష్యంగా పెట్టుకున్నారని మండిపడ్డారు. రైతులు, వ్యవసాయ కార్మికులు, కౌలు రైతులు, కార్మికులు ఈనెల 26న నిరసన ర్యాలీని జయప్రదం చేయాలని కోరారు. సిఐటియు నాయకులు రాజు, కుద్దుస్, నరసన్న, మల్లేష్, సురేష్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు లక్ష్మీ నరసయ్య

బాల్యవివాహాలను అరికడదాం

- డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ సత్యవతి

ప్రజాశక్తి - ఆదోని

చిన్న వయస్సులో వివాహాలు చేయడం వల్ల ప్రసవ సమయంలో చాలామంది ప్రాణాలు కోల్పోతున్నారని, బాల్య వివాహాలను అరికట్టేందుకు కృషి చేయాలని డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ సత్యవతి తెలిపారు. శుక్రవారం ఆదోని ఐసిడిఎస్ కార్యాలయంలో సిడిపిఒ ఉమామహేశ్వరమ్మ అధ్యక్షతన ఎఎన్ఎం, మహిళా పోలీసులకు కిశోరి వికాసం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రజక కార్పొరేషన్ ఛైర్మన్ సావిత్రి, మున్సిపల్ కమిషనర్ కృష్ణ, తహశీల్దార్ శివరామ, ఎంఇఒ రాజేంద్రప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. నిరక్షరాస్యత కారణంగా ఈ ప్రాంతంలో బాల్య వివాహాలు ఎక్కువగా జరుగుతున్నాయని తెలిపారు. గర్భం దాల్చినా రక్తహీనత సమస్య వేధిస్తుందని, ప్రసవ సమయంలో సమస్యలు ఏర్పడి కొందరు ప్రాణాలు కోల్పోతున్నారని చెప్పారు. గర్భిణిగా గుర్తించినప్పటి నుంచి ప్రసవం వరకు వారికి తరచూ పరీక్షలు నిర్వహిస్తూ పోషకాలు తీసుకునేలా సూచించాలని తెలిపారు. బాల్య వివాహాలు జరుగుతున్నప్పుడు సమాచారం ఇవ్వాలని, మేనరిక వివాహాలు జరగడం వల్ల సంతానంపై ప్రభావం చూపుతుందని తెలిపారు. ఇలాంటి విషయాలపై కూడా అవగాహన కల్పించాలన్నారు. కార్యాలయ సూపరింటెండెంట్ శంకర్, సూపర్‌వైజర్లు రాగిణి, వసంత, సావిత్రి ఉన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ సత్యవతి

స్కూల్ కాంప్లెక్స్‌ను కొనసాగించాలి

- విద్యాశాఖ కమిషనర్, డిఇఒకు వినతి

ప్రజాశక్తి - హొళగుంద

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఇంగలదహల్ గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కాంప్లెక్స్‌ను యథావిధిగా కొనసాగించాలని ఎంపిటిసి మల్లికార్జున, ఇంగలదహల్ సర్పంచి భర్త వెంకటరామిరెడ్డి, గ్రామ పెద్దలు శ్రీకాంత్ రెడ్డి, పాఠశాల విద్యా కమిటీ ఛైర్మన్ ఉరుకుందు, యూత్ అసోసియేషన్ సభ్యులు కోరారు. శుక్రవారం కర్నూలుకు వచ్చిన రాష్ట్ర విద్యా శాఖ కమిషనర్ సురేష్‌కు, డిఇఒ శ్యాముల్ పాల్‌కు కర్నూలు నగరంలోని పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పాఠశాల స్థితిగతులను విద్యా శాఖ కమిషనర్‌కు వివరించారు. స్పందించిన విద్యాశాఖ అధికారులు కాంప్లెక్స్‌ల విషయాలను పరిశీలించి అందరి అభిప్రాయాల మేరకు నిర్ణయాలు తీసుకుంటామని తెలిపారు. కాంప్లెక్స్‌ల తొలగింపును పునఃపరిశీలన చేస్తామని హామీఇచ్చారు. ఇంగలదహల్, ఎమ్‌డి.హళ్లి, పెద్ద గోనెహాల్ గ్రామ పెద్దలు, యూత్ సభ్యులు వీరేష్, శేఖర్, సుభాన్, హనుమంతు, రాజు, పంపాపతి, మల్లికార్జున, ఇబ్రహీం, శివ, నాగరాజు పాల్గొన్నారు.

'రాజ్యాంగ పీఠికపై అవగాహన అవసరం'

ప్రజాశక్తి - ఎమ్మిగనూరురూరల్

రాజ్యాంగ పీఠికపై విద్యార్థుల్లో అవగాహన అవసరమని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి విజయ్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని పార్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో గణతంత్ర దినోత్సవం సందర్భంగా రాజ్యాంగ పీఠికను విద్యార్థులతో చదివిస్తూ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం వచ్చిన తర్వాత దేశంలో సాంఘిక, ఆర్థిక, రాజకీయ న్యాయాన్ని, భావ ప్రకటనలను హరించి వేస్తూ ప్రజల మధ్యన మతోన్మాద గొడవలను సృష్టిస్తూ ప్రజలను విడగొట్టే రాజకీయాలు చేస్తోందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా కేంద్ర ప్రభుత్వాన్ని అనుసరిస్తూ రాష్ట్రంలో ప్రజల మధ్య గొడవలను సృష్టిస్తూ రాజకీయాలు చేస్తోందని మండిపడ్డారు. ఎస్ఎఫ్ఐ నాయకులు మహేష్, మనోజ్, ఉదయ్ పాల్గొన్నారు.

ఉర్దూ మహిళా ఉపాధ్యాయులను రెగ్యులర్ చేయాలి

- మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర కార్యదర్శి నూర్ అహ్మద్

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని పట్టణంలోని మసూదియా అరబిక్ ఎయిడెడ్ ప్రాథమికోన్నత పాఠశాలలో దశాబ్దాలుగా పని చేస్తున్న పేద మహిళా ఉపాధ్యాయులను రెగ్యులర్ చేయాలని మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర కార్యదర్శి నూర్ అహ్మద్ డిమాండ్ చేశారు. శుక్రవారం వారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉన్న వారిని రెగ్యులర్ చేయకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. వారి స్థానంలో కొత్తవారిని తీసుకోరాదని స్కూల్ యాజమాన్యాన్ని కోరారు. పేద మైనారిటీ మహిళా ఉపాధ్యాయులు దశాబ్దాలుగా పని చేస్తూ తమ జీవితం మొత్తం మసూదియా అరబిక్ స్కూల్‌కు సేవలు అందించారని తెలిపారు. మైనారిటీ, ముస్లిం సమాజంలో మహిళల విద్య అంతంత మాత్రమేనని గ్రహించాలని చెప్పారు. ఇలాంటి పరిస్థితుల్లోనూ ఈ మైనారిటీ మహిళలు బాగా చదువుకుని ఉపాధ్యాయులుగా మసూదియా అరబిక్ స్కూల్‌లో కొందరు పదేళ్లు, మరికొందరు 25 ఏళ్లుగా సేవలు అందిస్తున్నారని తెలిపారు. మానవతా దృక్పథంతో పాఠశాల యాజమాన్యం, ఆదోని షాహి జామియా మసీదు పాలకమండలి, పెద్దలు సౌదీ రావుఫ్ స్పందించి పేద మహిళా ఉపాధ్యాయులను రెగ్యులర్ చేసి ఆదుకోవాలన్నారు. కారణం లేకుండానే ఉపాధ్యాయులను తీసేసి కొత్త వారిని నియమిస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. దీనిపై బాధితులు, వారి కుటుంబ సభ్యులతో కలిసి న్యాయ పోరాటానికి, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యా శాఖ మంత్రి లోకేష్‌ను కలుస్తామని తెలిపారు.

ఎంపిడిఒ విస్తృత తనిఖీలు

ప్రజాశక్తి - నందవరం

పంచాయతీలో గల ఎన్‌టిఆర్ సుజల స్రవంతి ఆర్ఒ ప్లాంట్‌ను, జలజీవన్ మిషన్ కింద చేపట్టబోయే పనులను, మేజర్ పంచాయతీకి తిమ్మారెడ్డి కుంట నుంచి నీటిని సరఫరా చేసే బావిని, చెరువును ఎంపిడిఒ పుల్లయ్య పరిశీలించారు. శుక్రవారం నందవరం పంచాయతీలో ఆధార్ కేంద్రాన్ని, సచివాలయం, పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి హాజరు పట్టికను పరిశీలించారు. సచివాలయానికి ఆలస్యంగా వచ్చిన వారిపై శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. మండలంలో జరుగుతున్న సర్వేలు, కమ్యూనిటీ అసెట్స్, మిస్సింగ్ సిటిజన్స్, ఫ్యాక్స్, ఆధార్ ఎన్‌రోల్‌మెంట్‌ను వేగవంతం చేయాలని సచివాలయం సిబ్బందిని, పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. విస్తరణాధికారి సందీప్, ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజినీర్ మూర్తి పాల్గొన్నారు.

సచివాలయంలో తనిఖీ చేస్తున్న ఎంపిడిఒ

పాస్‌పోర్టు పోయినది

యస్.మహమ్మద్ గౌస్ తండ్రి యస్.లాలమ్ సాహెబ్, ఇంటి.నెం.41/529-బి-1, రైతుబజార్ దగ్గర, కొత్తపేట, కర్నూలు - 518001, అను నేను 11-7-1997 సంవత్సరంలో పాస్‌పోర్టు తీసుకున్నాను. పాస్‌పోర్టు నెం.ఎ3009395 ఫైల్ నెం.హెచ్.వై.డి.ఎ05265497 నేను అటోలో 2024 డిసెంబర్ 28 వ తారీఖున రోజా నుండి.కొత్తపేటలోని మా ఇంటికి కు ఆటో పోవుచుండగా నా బ్యాగ్ పడిపోయినది. కావున దయఉంచి నా పాస్‌పోర్టు ఎవరికైన దొరకిచో నాకు క్రింది అడ్రస్‌కు ఇవ్వగలరని ప్రార్థిస్తున్నాను.

యస్.మహమ్మద్ గౌస్
తండ్రి యస్.లాలమ్ సాహెబ్,
ఇంటి.నెం.41/529-బి-1,
రైతుబజార్ దగ్గర,
కొత్తపేట, కర్నూలు-518001
సెల్ నెం.9951677007